www.prajasakti.com
# ప్రజాశక్తి
ఆదివారం 2 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్

## నేత్ర వైద్య సేవలు అభినందనీయం
### - జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రజలకు అందిస్తున్న నేత్ర వైద్య సేవలు అభినందనీయమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి అన్నారు. శనివారం నగరంలో ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రాంగణంలో మొదటి సంవత్సరం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి మాట్లాడుతూ ఎల్వి ఐ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వీరితోపాటు నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఎల్విపి ఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్, డాక్టర్ రమేష్, డాక్టర్ అవినాష్ పాల్గొన్నారు. సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## శ్రీనివాసపురం
# రిజర్వాయర్‌కు నీళ్లిస్తాం

అభివాదం తెలియజేస్తున్న సిఎం

ప్రజావేదిక కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు, విభిన్న ప్రతిభావంతుడికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న సిఎం

### కొప్పర్తి పారిశ్రామికవాడకు చేయూత
### రూ.1.64 కోట్లతో శిలాఫలకం ఆవిష్కరణ
### సంబేపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజావేదికకు హాజరైన ప్రజలు

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి**

సాధ్యమైనంత తొందరగా హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను పూర్తి చేసి, శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీళ్లిస్తామని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలంలోని ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, పేదల సేవలో పేరుతో నిర్వ హించిన పింఛన్ల పంపిణీ అనంతరం ప్రజావేదిక కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పింఛన్ లబ్ధిదారులైన కొప్పుల మంగమ్మ, గొల్లచలపతి, వెంకటేశ్వర్లు ఇళ్లకు వెళ్లి యోగక్షేమాలను తెలుసుకుని రూ.4 వేలు, వికలాంగుడైన వెంక టేశ్వర్లుకు రూ.ఆరువేల ఫింఛన్ అందించడంతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన వత్సర కింద మరో నాలుగు వేలను కలిపి మంగమ్మకు రూ.ఆరు వేలు, వికలాంగుడైన వెంకటేశ్వర్లుకు రూ.10 వేలు ఇస్తామని తెలిపారు. అనంతరం పింఛనుదారుల అభ్యర్థన మేరకు ఇళ్ల స్థలం, ఇళ్ల నిర్మాణానికి హామీనిచ్చారు. అనంతరం వికలాంగుడైన వెంకటేశ్వర్లకు ఎలక్ట్రిక్ ట్రైసైకిల్, రూ.30 వేల విలువ కలిగిన సబ్సిడీ సోలార్ విద్యుత్ సదుపాయాన్ని కలిగించారు. రూ.1.64 కోట్లతో సిసి రోడ్ల నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను నింపితే 30 వేల ఎకరాలు సాగులోకి వస్తుందని తెలిపారు. రాయచోటికి శ్రీనివాసాపురం ప్రాజెక్టు ద్వారా నీరు అందిస్తామన్నారు. నీరు ప్రణధారం అని గుర్తించిన ప్రభుత్వం రాయలసీమలో నీటిని స్టోరేకరించి రాష్ట్రంలో కోనసీమ కంటే రాయలసీమ అత్యధిక ఆధాయ వనరును సృస్తిస్తామన్నారు. చెత్త నుండి సంపదను సృష్టించే మార్గాలను కూడా చేపడతామన్నారు. రాయలసీమలో హార్టికల్చర్, ఆంధ్రాలో ఆక్వా కల్చర్, కోస్తాలో ఆయిల్ ఫామ్ పంటలు ఆర్థిక లాభాలకు బాటలు వేసేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. సంపదను సృస్టించే మార్గాలు తెలివి తేటలతోనే వస్తాయని, ఆ తెలివి అనేది మన పిల్లల చదువులోనే వుందన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని, ఈ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మార్చి రాష్ట్రంలో ప్రధాన ఆదాయ వనరుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో కూరగాయలు సాగుచేసే రైతులు అధికంగా వున్నారని తెలిపారు. ప్రతి ఏడాది పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక అనేక మంది రైతు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఖచ్చితంగా మద్దతు ధరను ప్రతి పంటకు అందిస్తామన్నారు. రాయలసీమలో ఉద్యానపంటలకు పుట్టినిల్లుగా మారిందని, అది మన రాయలసీమ జిల్లాల ప్రధాన ఆదయవనరుగా మార్చుకోవాలన్నారు. కడపలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు చేయూతనిస్తామన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ ఎనిమిది నెలల కాలంలో ఎప్పుడు లేని విధంగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందజేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో కేవలం ఏడు నెలల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కిషోర్‌కుమార్‌రెడ్డి, అరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి, జయచంద్రారెడ్డి షాజహాన్‌బాషా, అన్నమయ్య డెవలప్‌మెంట్ చైర్మన్ రూపానందరెడ్డి, కలెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

సామాజిక పింఛను పంపిణీ చేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

# నిరాశాజనకం

**ఉక్కు పరిశ్రమ ఊసే లేదు - కిసాన్ కార్డుల పరిమితి పెంపు - వేతన జీవులకు ఉపశమనం**

**ప్రజాశక్తి- కడప ప్రతినిధి/కడప అర్బన్**

కేంద్ర బడ్జెట్ 2025-26 తీవ్ర నిరాశను కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 రూ.50.65 లక్షల కోట్ల బడ్జెట్‌ను శనివారం ప్రవేశపెట్టారు. కేంద్రంలోని బిజెపి, కూటమి సర్కారు ప్రాధాన్య తలకు అనుగుణంగా పోలవరం, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తావనకు మాత్రమే పరిమితమైంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, వెనుక బడిన ప్రాంతాలకు నిధుల ప్రస్తావన కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారుకు నిర్లక్ష్యానికి పూర్తిస్థాయి బడ్జెట్‌లో చోటు లభించకపోవడం గమనార్హం. జిల్లాలో కూటమికి 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం చేసింది. కిసాన్ కార్డుదారుల రుణ పరిమితి పెంపు, వేతన జీవులకు పన్ను రిబేటు సదుపాయాన్ని పెంచడం మినహా ఎటువంటి నిర్మాణాత్మక అభివృద్ధికి ఊతమివ్వక పోవడం గమనార్హం. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావనే కనిపించలేదు.

కేంద్రబడ్జెట్ 2025-26 జిల్లావాసులను నిరాశపరిచింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయింపుల జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రస్తావనే కనిపించలేదు. ఉమ్మడి జిల్లాలోని ఐదు లక్షల మంది రైతులకు కిసాన్‌కార్డుల రుణ పరిమితిని రూ.మూడు లక్షల నుంచి రూ.ఐదు లక్షలు, ఎంఎస్ఎంఇలకు రూ.10 లక్షల వరకు పెంచింది. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో రూ.7.5 లక్షల పన్ను రిబేటును రూ.12.75 లక్షల పెంచడం స్వల్ప ఉపశ మనం కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది లబ్ధి చేకూరునుంది. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు టిడిపి ఎంపీల మద్ధతు అవసరమైన నేపథ్యంలో గుడ్డిలో మెల్ల చందంగా వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల ప్రస్తావన మరిచింది. విశాఖ-చెన్నయ్ కారిడార్‌లో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీళ్ల, విద్యుత్, రోడ్డు, హైవేల ఏర్పాటు ప్రస్తావనే లేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప- విజయవాడ, ఓబుల వారిపల్లి- కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రస్తావనే కనిపించలేదు.

### ఆశించిన ఊరట లేదు

కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు, రైతులకు, కూలీ వర్గాలకు, మధ్య తరగతి ప్రజలకు ఆశించిన ఊరట అందలేదు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఈ బడ్జెట్ రూపుదిద్దుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులకు మద్దతు ధరలు పెంచేలా, ఉపాధి అవకాశాలు సృష్టించేలా, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలి

**- ఎన్.డి.విజయ్ జ్యోతి, డిసిసి అధ్యక్షులు.**

### ప్రజా వ్యతిరేక బడ్జెట్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపె ట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరే కమైంది. కార్పొరేట్ అనుకూల నిర్ణయాలతో ఆర్థికంగా చిన్నాభిన్నం అయింది కేంద్రమంత్రి సంస్కరణలు కొనసాగిస్తామని, సంస్కరణల అమలుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం దారుణం. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచే చర్యల్ని మోడీ ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంది.

**- జి.చంద్రశేఖర్, సిపిఎం, జిల్లా కార్యదర్శి.**

### ఎన్నికల బడ్జెట్‌గా మార్చింది

బడ్జెట్‌లో విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేకపోయారు. బిజెపి ఎన్నికల బడ్జెట్‌గా మార్చింది. కనీసం కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వెనకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీ పై కూడా బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విచారకరం. **- గాలి చంద్ర, సిపిఐ జిల్లా కార్యదర్శి**

### ఎపికి మళ్లీ అన్యాయం

కేంద్ర బడ్జెట్‌లో ఈ సారి కూడా బిజెపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేసింది. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హోదా అమలు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొనలేదు. విభజన చట్టంలో 13 వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగాలి కాని వాటి గురించి గురించి బడ్జెట్ లో ప్రస్తావించలేదు. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఉండి కూడా రాష్ట్రానికి ఇంత అన్యాయం జరిగింది.

**- ఎన్. తులసిరెడ్డి, పిసిసి అధికార ప్రతినిధి.**

### బీమా రంగంలో ఎఫ్‌డిఐ నష్టదాయకం

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన మేరకు బీమా రం గంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచడం వల్ల బీమారంగానికి, పాలసీదారులకు మేలు చేయదు. వం ద శాతం ఎఫ్‌డిఐ అంటే అంటే అర్థం - స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడమే.

**- ఎ.రఘునాథరెడ్డి, ఎల్ఐసి యూనియన్ నాయకులు, కడప.**

### ఉద్యోగులకు భారీ ఊరట

ఆర్థిక బడ్జెట్‌లో రూ.12 లక్షలు ఆదాయం వరకు ఎటువంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేల కలుపుకొని రూ.12.75 లక్షల వరకు ఆదాయపన్ను లేకపోవడం వల్ల వేతన జీవులకు భారీ ఊరట లభించింది.

**- జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం**

# ట్రిపుల్‌ఐటిలకు నిధుల కొరత

### రూ.300 కోట్లకు ప్రతిపాదనలు
### 660 రెగ్యులర్ పోస్టులు భర్తీకి ప్రణాళిక
### ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్

**ప్రజాశక్తి-వేంపల్లె**

రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటిలకు నిధులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఆర్‌జెయుకెటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్‌ఐటిలు నూజివీడు, ఇడుపుల పాయ, ఒంగోలు, శ్రీకాకుళంలోని ట్రిపుల్‌ఐటిలకు నూతన భవనాలు, ఇన్‌ఫ్రాస్టక్చర్, కంప్యూటర్లు, మౌలిక వసతులు, తదితర వాటికి రూ.300 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గతంలో రూ.100 కోట్లు అడగగా రూ.50 కోట్లు జీతాలకే సరిపోయిందన్నారు. ప్రస్తుతానికి ఒంగోలు ట్రిపుల్‌ఐటికి సంబంధించి నూతన భవనాలు రూ.200 కోట్లు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటికి సంబంధించి రూ.50 కోట్లు, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటిలకు సంబంధించి రూ.50 కోట్లు అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పియుసి, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించి 660 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అయితే కొందరు కోర్టుకు పోవడంతో పోస్టుల భర్తీ ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కోర్టు కేసులను క్లియర్ చేసిన తర్వాతనే రీ-నోటిఫికేషన్ ను ఇచ్చి పోస్టులు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందించనుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు అంతంత మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంట్రాక్టు పద్ధతుల పనిచేస్తున్న అధ్యాపకులకు మినిమం టైం స్కేల్‌ను అందించాలని విలేకరులు అడగగా ఈ విషయంపై తమ చేతుల్లో లేదని ప్రభుత్వ మే నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ట్రిపుల్‌ఐటిలలో కొత్తగా ఎఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ మిషన్ లర్నింగ్) కోర్సును ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అయితే ఈ కోర్సుకు సంబంధించి గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం ట్రిపుల్‌ఐటిలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా సైకాలజిస్టులను పిలిపించి విద్యార్థుల్లో అవ గాహన కల్పించాలని డైరెక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జెయుకెటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సంద్ర, డైరెక్టర్లు ప్రొఫెసర్ కుమా రస్వామి గుప్తా, ప్రొఫెసర్ బాలాజీ, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విసి విజయ్‌కుమార్

### హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలి : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి-అట్లూరు :** విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్న కమలాకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమ కుమారిని సస్పెండ్ చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ప్రధానో పాధ్యాయురాలి వేధింపులపై కమలకూరు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాటా ్డుతూ కమలకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రేమ కుమారి విద్యార్థులను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 11 మంది విద్యార్థులను టిసిలు ఇస్తానని బెదిరిస్తూ గత రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రధానోపాధ్యాయురాలిని వెంటనే విధుల నుండి తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారన్నారు. అఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా డ్రాప్ అవుట్స్ పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోవాలని ఆదేశాలు ఇస్తుంటే, ఈ ప్రధానోపాధ్యాయులు మాత్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులును ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులు పాఠశాలకు రాలేక పోతే వారిని డ్రాప్ అవుట్స్ పేరుతో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఆమె వేధింపులు భరించలేక ఇలాంటి హెడ్‌మాస్టర్ తమకొద్దని గ్రామస్తులు పేర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఆమెపై కలెక్టర్, డిఇఒ ఫిర్యాదు చేస్తున్నామని, అధికారులు స్పందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో డివైఎఫ్ఐ కలిసివచ్చే విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చ రించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, డివైఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

### వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

**ప్రజాశక్తి - వల్లూరు :** చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నాగరాజు వైద్య సిబ్బందికి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పుల గది, ఓపి, సిహెచ్‌ఆర్ వార్డులను పరిశీలించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిడమాజిస్ట్ కాజాముద్దీన్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, సిహెచ్ఒ వేణుగోపాల్ రావు, సూపర్‌వైజర్ సుధాకర్, ఎఎన్ఎం నీలావతి, ఆశా కవిత, అంగన్వాడీ వర్కర్ అరుణ పాల్గొన్నారు.

# జాగృతి
ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి పరిణామాలు ప్రజలను చైతన్యం కలిగించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా రెండ్రోజులపాటు సిపిఎం చేపట్టిన జీపుజాతా ప్రజలను ఆలోచింపజేసింది. కడప జిల్లాలో ఉక్కుపరి శ్రమను ఏర్పాటు చేయాలని, జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ పేదలను వర్తింపజేయాలని కోరుతూ సాగిన జీపుజాతా సరైన సమయంలో సరైన దిశగానే సాగిందనే చెప్పాలి. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే గల్ఫ్ సహా బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్ మహా నగరాలకు వెళ్లే వలసల్ని నివారించొచ్చని ఉద్ఘాటిం చడం గమనార్హం. విశాఖ ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసిన ప్రదేశానికి ప్రపంచంలోనే సరైన గుర్తింపు లభించడం, రాష్ట్రంలోనే తలసరి ఆదాయం పెరిగిన ప్రదేశంగా గుర్తింపు పొందిన సందేశాన్ని వినిపిస్తూ కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదాన్ని ఇంటింటికీ చేర్చాలని పిలుపునివ్వడం యువతను ఆకట్టుకుందనే చెప్పాలి. మోడీ నాయకత్వంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్రంలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేనపై ఆధారపడి సాగుతున్న నేపథ్యాన్ని గుర్తు చేయడం ద్వారా బృహత్తరమైన బాధ్యతను గుర్తు చేసింది. కేంద్ర, రాష్ర ప్రభుత్వాలు బడ్జెట్లను ప్రవేశపెడుతున్న తరుణంలో వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయాలనే ఒత్తిడిని పెంచే ప్రయత్నం చేయడం సమంజసంగానే ఉందని చెప్పవచ్చు. శనివారం నాటి కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు తీసుకురావడం, కడప-బెంగళూరు రైల్వే లైన్ సహా మిగిలిన రైల్వేలైన్లకు తగిన కేటాయింపులు చేయాల్సి ఉంది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకపోతే కూటమి పార్టీలే బాధ్యత వహించేలా చేయడంలో కృత కృత్యులైనట్లు కనిపిస్తోంది. మరో వామపక్ష రాష్ట్ర నాయకులు జిల్లాలోని పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా చర్చనీయాంశం చేసింది. ఎగిసి పడిన ప్రజాఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం తలవంచి ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం స్థల సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు కనిపిస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం ఏమేరకు స్థలాన్ని సేకరిస్తుంది, ఏమేరకు ఆచరణలోకి తీసుకు వస్తుందో వేచి చూడాల్సి ఉంది.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

# ఉత్సాహంగా.. బాలోత్సవం

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

**కడప బాలోత్సవం పిల్లల పండుగకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించింది. బాలోత్సవం వేడుకల్లో ఎంతో ఉత్సాహంగా సాగాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభతో తయారు చేసిన ఆకృతులు, ప్రయోగాలలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా అందరినీ అలరించాయి.**

- పిల్లల పండుగకు అపూర్వ స్పందన
- అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- ఆకట్టుకున్న విద్యార్థుల నైపుణ్యాల ప్రదర్శన
- అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు
- జెండా ఆవిష్కరించి కార్యక్రమాలు ప్రారంభించిన డిఇఒ

బాలోత్సవ, జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న డిఇఒ, జెవివి నాయకులు

**ప్రజాశక్తి - కడప అర్బన్**

శనివారం కడప సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో మొదటిరోజు బాలోత్సవంలో డిఇఒ షంషుద్దీన్ జాతీయ పతాకాన్ని, డాక్టర్ రాజా వెంగల్ రెడ్డి బాలోత్సవ జెండాను ఆవిష్కరించారు. దాదాపు 1200 మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. సైన్స్ ఎగ్జిబిషన్, మట్టి బొమ్మలు, వ్యాసరచన పోటీలు, కథా రచన, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్స్ గీయడం, మెమరీ టెస్ట్, పత్రికల పట్టణం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. 2000 మంది విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. పోటీలలో పాల్గొన్న వారికి బాలోత్సవ కమిటీ నాయకులు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. న్యాయ నిర్ణయితలుగా వైవీయూ యూనివర్శిటీ దాదాపు 30 మంది ప్రొఫెసర్లు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు వ్యవహరించారు. ఒక పండుగ వాతావరణం నెలకొంది. బాలోత్సవ ప్రాంగణమంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిర్వాహకులతో కిటకిటలాడింది. దాతల సహకారంతో హాజరైన ప్రతి ఒక్కరికి భోజన సౌకర్యాన్ని కల్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఇఒ షంషుద్దీన్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులు హాజరు కావడం హర్షణీయమన్నారు. మానసిక వికాసానికి, సైంటిఫిక్ టెంపర్, మానవత్వాన్ని పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. పిల్లలు మంచి భవిష్యత్తుకు తోడ్పడే విధంగా కార్యక్రమాలు రూపొందించినందుకు నిర్వాహకులను అభినందించారు. ఎంఇఒ గంగిరెడ్డి, బాలోత్సవం గౌరవ సలహాదారులు వీర సుదర్శన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు, డాక్టర్ ఓబుల్ రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషా తులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి , రఘునాథరెడ్డి, మహేష్ హాజరయ్యారు.

సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా 12 అంశాలతో సీనియర్స్, జూనియర్స్ సబ్ జూనియర్స్ విభాగాల కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించారు. జానపద నృత్యం, క్లాసికల్ డాన్స్, దేశభక్తి గీతాలాపన, రైమ్స్, ఫ్యాన్సీ డ్రెస్, విచిత్ర వేషధారణ అంశాలలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో 965 మంది విద్యార్థులు 12 అంశాలలో నాలుగు వేదికల పైన నిర్వహించారు. మట్టి బొమ్మలు, సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాసరచన, దినపత్రిక పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం బెస్ట్ కార్టూన్స్, మెమరీ టెస్ట్ గోపినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.


విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న అతిథులు

బాలోత్సవంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రముఖులు

రైతుకు నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి బాల సుబ్రమణ్యం

## బాధిత రైతుకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - వేంపల్లె**

అడవి పందులతో పంట నష్టపోయిన రైతుకు అటవీ అధికారులు నష్టపరిహారం అందించారు. ఇటీవల స్థానిక రాజీవ్ కాలనీ సమీపంలోని కొండ ప్రాంతంలో సువర్ణ అనే మహిళ రైతు అరటి పంటను అడవి పందులు స్వైర విహారం చేసి పంటను పూర్తిగా దున్నేశాయి. దీనిపై బాధిత మహిలా రైతు అటవీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు వారు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. బాధిత మహిళా రైతు సువర్ణకు రూ.90,270 చెక్కును ఫారెస్ట్ రెంజ్ అధికారి బాల సుబ్రమణ్యం అందజేశారు. అడవి జంతుల ద్వారా నష్టపోయిన రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పి.వెంకటసుబ్బయ్య, సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఖాదర్ జిలానీ, బీట్ ఆఫీసర్ డి.శివమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యుత్ సిబ్బంది

## రూరల్ ఎఇ రమేష్‌రెడ్డికి శుభాకాంక్షలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల పట్టణ టౌన్ ఎఇగా పనిచేస్తున్న రమేష్ రెడ్డి ఇటీవల అధికారుల ఉత్తర్వుల మేరకు రూరల్ ఎఇగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. తనకు ఇచ్చిన బాధ్యతను తప్పకుండా విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎడిఇ గురు మోహన్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ నాయుడు, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

## క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఎఇ దినేష్‌కుమార్ తెలిపారు. సింహాద్రిపురం విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇకపై విద్యుత్ బిల్లు చెల్లింపు చాలా సులభతరమన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ప్రతి నెల మొదటి వారంలో వినియోగదారుల మీటర్‌ను స్కాన్ చేసి బిల్లు ఇస్తున్నారని తెలిపారు. అయితే ఫిబ్రవరి నుంచి మీ బిల్లు క్రింది భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఇస్తారన్నారు. మీ మొబైల్‌లో ఉన్న ఏదైనా యుపిఐ అనగా ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం మీరు ఓపెన్ చేసి అందులో ఉన్న స్కానర్‌తో బిల్లులో ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే మీరెంత బిల్లు చెల్లించాలో వస్తుందన్నారు. ఒక్క నిమిషంలో బిల్లు మీ ఇంటి నుండే సులభంగా చెల్లించ వచ్చన్నారు. వినియోగదారులు ఇకపై విద్యుత్ కార్యాలయం వెళ్లవలసిన అవసరంలేదన్నారు.

## స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

మండలంలోని బిసి, కాపు(బలిజ), రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఆర్యవైశ్య, ఇబిసి, బ్రాహ్మణ సామాజిక వర్గాల వారు స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి సూచించారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ ద్వారా రాయితీతో కూడిన రుణాలు పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హతగల వారు ఈనెల 7లోపు ఆన్‌లైన్‌లో ఎపిఒబిఎంఎం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 8 నుంచి 11వతేదీ వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. బిసి వర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - వేముల**

గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని ప్రజలు ప్రశాంతమైన జీవితం గడపాలని, అందుకు పోలీసులు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందిస్తారని ఆయన తెలిపారు. చింతల జూటూరు, వేముల గ్రామాల్లో శనివారం ఎస్ఐ పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సోదరభావంతో మెలగాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## 56 మద్యం బాటిళ్లు స్వాధీనం

**ప్రజాశక్తి - లింగాల**

మండల పరిధిలోని అంబకపల్లె గ్రామంలో శనివారం బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న నందలి శివగంగిరెడ్డి నుంచి 56 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌క్మి మధుసూదన్ రావు తెలిపారు కేసు నమోదు చేశా మన్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## నాణ్యమైన ఉత్పత్తులు విక్రయించాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు** : వ్యవసాయ శాఖ అనుమతి పొందిన నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి డీలర్లకు సూచించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఎఒ తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లు, లైసెన్స్, స్టాక్ నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి పొందిన ఫారం ఒ ఉత్పత్తులు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. లైసెన్స్ ప్రదర్శించి స్టాక్‌బోర్డ్, ధరల పట్టిక కనపడేలా ఉంచాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఉత్పత్తులకు నగదు బిల్లు ఇవ్వాలని సూచించారు. నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల నిమిత్తం ప్రయోగ శాలకు పంపామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నాణ్యత ప్రమాణాలు లేకుంటే అలాంటి అమ్మకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం నిబంధనలు అనుసరించి వ్యాపార లావాదేవీలు కొనసాగించాలన్నారు.

## అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

గత నెల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్ అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం వైవి సుబ్బారెడ్డి పరామర్శించారు. పట్టణంలోని అభిషేక్ నివాసానికి వెళ్లి ఆయన తండ్రి వైఎస్ మధుసూదన్ రెడ్డి, తాత ప్రకాష్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అభిషేక్‌రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌రెడ్డి విజయానికి ఎంతగాలో తోడ్పడ్డారన్నారు.



అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ వైవి సుబ్బారెడ్డి

# ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియులో చేర్చుకుంటున్న యూనియన్ నాయకులు

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు గౌరవ అధ్యక్షులు జి.ఏసుదాస్ కోరారు. పట్టణంలోని పూల అంగళ్ల వద్ద ఉన్న ఆటోడ్రైవర్లను సిఐటియులోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉంటే కడప జిల్లాలో 35వేల మంది ఆటోడ్రైవర్లు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు ప్రయాణికులను గమ్య స్థలానికి చేరవేస్తూ ప్రభుత్వానికి రూ.కోట్ల పన్నులు చెల్లిస్తున్నారన్నారు.

ఆటోడ్రైవర్లకు పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 21, 31ని రద్దు చేసి డ్రైవర్లకు మేలు చేయాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలపై థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 30 శాతానికి తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటోల మీద ఉన్న పోలీస్ ఇ చలనాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో మునిమధు, శంకర్, రామంజి, నాని, చంద్ర, మునిశేఖర్, మునయ్య, మహేష్, చిన్న మన్నయ్య, చౌడయ్య పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న రాజబాబు, వాసా శ్రీనివాసా

## వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

పశు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కొత్తపల్లె పశు వైద్యాధికారి వాసా శ్రీనివాసా ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు ప్రపంచ జూనోసిస్ దినోత్సవంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు 16 మంది పాల్గొన్నారు. ఇందులో మొదటి స్థానంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కె.రవిచరణ్, బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.గంగాభవాని రెండవ స్థానంలో, మూడవస్థానంలో బి.భవ్య (ఉప్పలూరు) నిలిచారన్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసా బహుమతులు అందజేశారు. ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వితంతు పెన్షన్ మంజూరు

**ప్రజాశక్తి - వేంపల్లె** : రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని ముల్లా వీధిలో పీరా అనే వ్యక్తి చనిపోవడంతో అతనికి వచ్చే ఫించన్‌ను ఆయన భార్య మైమున్‌కు మంజూరు చేశారు. ఈ సందర్భంగా శనివారం ఫించన్ పంపిణీలో మైమున్ అనే మహిళకు టిడిపి మండల కన్వీనర్ రామ మునిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు మాటలతో కాకుండా చేతలతో చూపిస్తున్నాడని, అందుకు నిదర్శనం భర్త చనిపోయిన వెంటనే భార్యకు ఫించన్ మంజూరు చేయడమేనని తెలిపారు. ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రాము, జబిబుల్లా పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్** :రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించొచ్చని ఎస్ఐ నారాయణ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో శనివారం సాయంత్రం ఎస్ఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లైసెన్స్‌లేని వాహనాలకు, ట్రిపుల్ రైడింగ్ చేసేవారికి జరిమానా విధించామన్నారు. ముఖ్యంగా పట్టణంలో చాలామంది లైసెన్స్ లేని వారు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

## 'ఉక్కు'పై గట్టిగా పోరాడుదాం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్** : జమ్మలమడుగు ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి మనమంతా గట్టిగా పోరాడుదామని ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారని నియోజకవర్గ కో-కన్వీనర్ సింగం శివమోహన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోటస్ పాండ్‌లో తాను షర్మిలను శనివారం మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. ఈ సందర్భంగా శివమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా, జమ్మల మడుగు నియోజగవర్గ ప్రజల సమస్యలను అడిగి తెలిపారు.

## 'ఫీజు పోరు' పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - కడప** : ఈనెల 5న నిర్వహించే ఫీజు పోరు కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో 'ఫీజు పోరు' పోస్టర్లను వారు ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించనున్నట్లు చెప్పారు. తర్వాత కలెక్టర్ వినతి పత్రం అందజేస్తామని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులను నట్టేట ముంచిందన్నారు. విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, కడప జిల్లా వైసీపీ విద్యార్థి విభా గం జిల్లా అధ్యక్షులు సాయి దత్త, నగర అధ్యక్షులు శివారెడ్డి పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్:** విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ఈ నెల 5న చంద్రబాబు ప్రభుత్వంపై ఫీజుపోరు కార్యక్రమం నిర్వహించనున్నామని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయం వద్ద ఫీజుపోరుతో కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో పెద్దముడియం మాజీ మండల అధ్యక్షులు పి.గిరిధర్ రెడ్డి, వైసిపి జిల్లా మునిసిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి హృషికేశవరెడ్డి, గొరిగనూరు సురేష్, భాస్కర్ రెడ్డి, గంగాధర్, కొండారెడ్డి, గుర్రప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.

## డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయాలి : యుటిఎఫ్

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** 2024, మేలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణవే డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ ఎం.విశ్వేశ్వర నాయుడును యుటిఎఫ్ నాయకులు కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల విధులు నిర్వహించారన్నారు. ఎన్నికలు మేలో నిర్వహించారని, వేసవి సెలవులను నష్టపోయిన ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్జిత సెలవులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ సెలవులను సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేయాలంటే ఎన్నికల విధులు నిర్వహించిన కాలానికి అధికారులు డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, కమలాపురం అసెంబ్లీ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులతో పాటు, జిల్లా వ్యాప్తంగా రిజర్వులో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్ తక్షణమే ఇప్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిఆర్ఒ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్ ఇప్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని తెలియజేశారు.

## జడ్జి ప్రవీణ్ కుమార్‌కు ఘన సన్మానం

**ప్రజాశక్తి - కడప :** జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై రాజంపేట మూడవ అదనపు జిల్లా జడ్జిగా వెళుతున్న ఎస్. ప్రవీణ్ కుమార్‌ను కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ నంద్యాల చిన్నయ్య, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, కోశాధికారి సుబ్బరామయ్య, సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ కడప జిల్లా కోర్టులో తాను పనిచేసిన కాలంలో తమ వంతు సహాయ సహకారాలు అందించి సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. జూనియర్ న్యాయవాదులకు మంచి భవిష్యత్తు ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి, నాలుగవ అదనపు జిల్లా జడ్జి దీన బాబు, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## తపాలా జీవిత బీమా డే

**ప్రజాశక్తి - కడప అర్బన్ :**కడప ప్రధాన తపాలా కార్యాలయంలో 141 వసంతాలు పూర్తి చేసుకుని 142వ వసంతంలోకి అడుగెడుతున్న సందర్భంగా తపాల జీవిత బీమాను ఘనంగా నిర్వహించారు. వినియోగదారులకు స్వీట్లు పంచిపెట్టారు. చాక్లెట్లు రోజాపూలు అందించారు. పోస్టల్ సూపరింటెండెంట్ జి.రాజేష్ కేక్ కట్ చేసి సిబ్బంది, కస్టమర్లకు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1884వ సంవత్సరంలో ప్రారంభం అయిన పిఎల్ఐ రోజురోజుకు ప్రాచుర్యం పొందుతుందని తెలిపారు. ప్రజలకు దగ్గర అవుతూ ఎక్కువ కస్టమర్లను సొంతం చేసుకుంటూ ముందుకు పోతుందని చెప్పారు. తపాలా జీవిత బీమా సెక్షన్‌లో బాగా పనిచేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, ఎం.విజయభాస్కర్ రెడ్డి, ప్రధాన తపాలా కార్యాలయ పోస్టుమాస్టర్ సుబ్బరాయుడు, పిఎల్ఐ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మునాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

## మలబార్‌లో ఆభరణాల ప్రదర్శన

**ప్రజాశక్తి- కడప అర్బన్ :** మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో అద్వితీయమైన ఆభరణాల ప్రదర్శన నిర్వహించారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్లో ఉన్న షోరూంలో కార్యక్రమాన్ని షోరూమ్ హెడ్ లెసన్ సత్యన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి 10వ తేదీ వరకు ప్రదర్శన అమ్మకాలు ఉంటాయని చెప్పారు. బంగారు, వజ్రాలు, జాతి రత్నాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్చార్జి ఇషాక్ బాషా పాల్గొన్నారు.

## భారీ స్కోరు దిశగా ఆంధ్ర

**ప్రజాశక్తి - కడప :** కల్నల్ సి.కె నాయుడు ట్రోఫీలో భాగంగా శనివారం కడపలోని వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ఆంధ్ర, హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. ఆంధ్ర జట్టు బ్యాట్స్‌మెన్లు హేమంత్ రెడ్డి, వెంకట రాహుల్ సెంచరీలు చేయడంతో ఆంధ్ర జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90.0 ఓవర్లలో 5 వికెట్లను నష్టానికి 360 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆ జట్టులోని ఎం. హేమంత్ రెడ్డి 226 బంతులను ఎదుర్కొని 16 బౌండరీలు, 1 సిక్సర్ సాయంతో 136 పరుగులు (సెంచరీ) చేశాడు. ఎస్. వెంకట రాహుల్ 216 బంతులు ఎదుర్కొని 13 బౌండరీలు, 3 సిక్సర్ల సాయంతో 162 పరుగులు (నాటౌట్) చేశాడు.

## ఘనంగా దివ్య జ్ఞానానందగిరి స్వామి పుట్టినరోజు వేడుకలు

**ప్రజాశక్తి - కడప :** తొగట వీర క్షత్రియ కుల గురువు, పుష్పాండజ మహర్షి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీశ్రీ దివ్యజ్ఞానానందగిరి స్వామి పుట్టినరోజు వేడుకలను ఎర్రముక్కపల్లె శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ, అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు స్వామివారికి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# కూలీల ఆటోను ఢీకొన్న ప్రయివేట్ ట్రావెల్స్

## ఒకరు మృతి, ఆటో డ్రైవర్‌తో సహా ఐదుగురికి గాయాలు

మృతి చెందిన వీరయ్య

**ప్రజాశక్తి - వీరపునాయునిపల్లె (వేంపల్లె)**

వీరపునాయునిపల్లె మండలం నేలతిమ్మయ్యగారిపల్లె సమీపంలో కూలీల ఆటోను ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన ముకుంద బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వీరయ్య(65) అనే వ్యక్తి మృతి చెందగా, మరో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన కూలీల వివరాల మేరకు.. వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉంటున్న శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చెంగ్రాయుడు అనే కూలీలు అదే ప్రాంతానికి చెందిన ఆంజనేయులు ఆటోలో బెల్దారి పనుల కోసం శనివారం ఎర్రగుంట్లకు బయల్దేరారు. ఆటో నేలతిమ్మయ్యగారిపల్లె గ్రామ సమీపంలోని మలుపు వద్దకు రాగానే హైదరాబాద్ నుంచి వేంపల్లెకు వస్తున్న ముకుంద ప్రయివేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఆటో బోల్తా పడడంతో కూలీలందరూ రోడ్డుపై పడిపోయారు. రక్త గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో వేంపల్లె ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ ఆంజనేయులు, వీరయ్య అనే కూలీ పరిస్థితి విషమం కావడంతో వారిని కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యలో వీరయ్య మృతి చెందాడు. వీరయ్య మృతదేహాన్ని వేంపల్లె ఆసుపత్రికి తరలించారు. రాజీవ్ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే గాయపడిన వారిని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, టిడిపి నేతలు వేమా కుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం చేయాలని వైద్యులను రామమునిరెడ్డి కోరారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన శ్రీనువాసులు, అంజనమ్మ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విసి విజయ్‌కుమార్

## ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణం

**ప్రజాశక్తి - వేంపల్లె**

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడం గర్వకారణమని వైస్ ఛాన్సలర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటిలో 2008 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమంలో మొదటిరోజు ఆర్కే వ్యాలీలోని కంప్యూటర్ సెంటర్ దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సండ్ర, డైరెక్టర్లు ఎవిఎస్ కుమారస్వామి గుప్తా, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్, బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించడానికి ఆర్జీయూకేటీని 2008లో స్థాపించారన్నారు. ఆ బ్యాచ్ విద్యార్థులు బీటెక్ పూర్తి చేసుకుని పదేళ్లయిన సందర్భంగా దాదాపు 200 మంది విద్యార్థులతో సమ్మేళనం నిర్వహించడం సంతోషకరమన్నారు. పూర్వపు విద్యార్థులు తమ గత అనుభవాలను ఒకరికొకరు పంచుకున్నారు. ముందుగా తమకు బోధించిన ఆర్కే వ్యాలీ క్యాంపస్ ఉపాధ్యాయ సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరగా ఆర్కేవ్యాలీ లలిత కళా విభాగం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో తొలిరోజు ముగిసింది. కార్యక్రమంలో ఆర్జీయూకేటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రసాద్, పరిపాలన అధికారి పి.రవికుమార్, అకడమిక్ డీన్స్ రమేష్ కైలాస్, రూపస్ కుమార్, పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షులు ఎండి రఫీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు చెల్లించకపోతే పరీక్ష రాయనివ్వం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

ఫీజు చెల్లించకపోతే పరీక్ష రాయనివ్వమని కళాశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేయడంతో ప్రొద్దుటూరు హనుమాన్ నగర్‌కు చెందిన పేద విద్యార్థి ప్రసన్న ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆ మేరకు శనివారం ప్రొద్దుటూరు మండల్ లీగల్ సర్వీస్ అథారిటీకి ప్రసన్న ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. శ్రీ లక్ష్మివెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కళాశాలలో ప్రసన్న ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రభుత్వం మంజూరు చేసే ఉపకార వేతనం ద్వారా ఆమెకు కళాశాలలో సీటు వచ్చింది. కళాశాలకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సోమవారం ప్రసన్న పరీక్ష రాయాల్సి ఉంది. కళాశాల ఫీజు కడితేనే పరీక్ష రాసేందుకు హాల్‌టికెట్ ఇస్తాం లేదంటే ఇవ్వం అని కళాశాల ప్రిన్సిపల్ (సెల్-9441155946) అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు ప్రసన్న వాపోయింది. మొదటి సంవత్సరం కూడా ఇలాగే ఇబ్బంది పెడుతుంటే అప్పుచేసి రూ.56వేలు ఫీజు చెల్లించామని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రసన్నకు ప్రభుత్వం ఉపకారవేతనం చెల్లిస్తున్నందు వల్ల ఎలాంటి ఫీజ్ చెల్లించాల్సిన అవసరం లేదని కళాశాల యాజమాన్యం చెప్పినందువల్లే తాను కళాశాలలో చేరానని అంటోంది. ఇప్పుడు యాజమాన్యం మాటమార్చి ఫీజ్ కడితనే.. లేకుంటే హాల్‌టికెట్ ఇచ్చేదిలేదని, పరీక్ష రాయలేవని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. పేదరికంలో ఉన్నా.. మొదటి సంవత్సరం చేసిన అప్పు ఇప్పటి వరకూ తీర్చలేదని కన్నీటిపర్యంతమైంది. తన చదువుకు ఆటంకం కలుగకుండా పరీక్ష రాసేందుకు అవకాశం ఇవ్వాలని ప్రసన్న అధికారులను కోరుతోంది.

హెచ్ఎం శివమునెమ్మకు నగదు అందజేస్తున్న సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి

## ఆటల పోటీలకు రూ.10 వేలు వితరణ

**ప్రజాశక్తి - వేంపల్లె**

పాఠశాల స్థాయిలో జరిగే ఆటల పోటీలకు టిడిపి యవనేత సింగారెడ్డి రజనీకాంత్ రెడ్డి (సూరి) రూ.10 వేలు ఆర్థికసాయం చేశారు. శనివారం బాలుర పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మకు నగదు దాత అందజేశారు. తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 77వ వార్షికోత్సవ సందర్భంగా పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసేందుకు ఆయన ఆర్థికసాయం చేయడం సంతోషకరమని హెచ్ఎం శివ మునెమ్మ తెలిపారు. దాతృత్వం అనేది విద్యార్థులు మరవరాదన్నారు. బాలుర పాఠశాలలో చదివిన రజనీకాంత్‌రెడ్డి విద్యార్థుల కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రగతి, క్రీడాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. రజనీకాంత్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఇటి రాజశేఖర్, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి పాల్గొన్నారు.

## డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంపొందించుకోవాలి : సర్పంచ్

**ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)**

ఆర్థిక అక్షరాస్యత పట్ల ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ సచివాలయంలో రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ ప్రొగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ రైతులు, పొదుపు సంఘాల మహిళలు, సైబర్ క్రైమ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామ సచివాలయ కార్యదర్శి టి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, పొదుపు నిర్వహణ జాగ్రత్తలపై ఈ కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉందన్నారు. రిటైర్డ్ ఎపిజిబి మేనేజర్ కృష్ణారెడ్డి సైబర్ క్రైమ్స్, బ్యాంకు లావాదేవీల గురించి వివరించారు. కార్యక్రమంలో కెఎస్ రూరల్ మీడియా కళాజాత బృందం కళా ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఉదయ్ కుమార్ సచివాలయ సిబ్బంది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులురెడ్డి

**మహారాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జీవారికోర్టులో**

**O.S No.148/2024**

షేక్ అల్లాబకాష్ తండ్రి ఖాదర్ భాష, ముస్లీం, వయస్సు 30 సం॥లు డోర్ నెం. 20-16, వాటర్ ట్యాంకు దగ్గర, కొత్తపల్లివీధి, రాయచోటి టౌన్

...వాది

**వర్సెస్**

**D2:** సయ్యద్ షాజహాన్, తండ్రి హుస్సేన్‌మియ్య, వయస్సు 59 సం॥లు, ముస్లీం, రైల్వేస్టేషన్ మాస్టర్, గంగాయపల్లె గ్రామం, వల్లూరు మండలం, కడప జిల్లా.

...2వ ప్రతివాది

**నోటీసు ప్రకటన**

పై నెంబరు దావాలో వాది, నీపైన మరియు ఇతర ప్రతివాదులపైన అగ్రిమెంటు విషయంగా దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీరు 10.02.2025 తేదీన ఉదయం 10:30 గం॥లకు ఖుద్దున గాని, వకీలుద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెల్పుకొనవలెయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

ఇట్లు
**శ్రీ. యస్. ప్రభాకర్‌రెడ్డి, B.Sc., LLB**
వాదిపరం అడ్వకేట్, రాయచోటి.